క్లుప్తంగా

నరసాపురం సబ్‌జైలు తనిఖీ

నరసాపురం: స్థానిక సబ్ జైలును శనివారం అదనపు జూనియర్ డివిజన్ సవిల్ జడ్జి కె.శ్రీనివాస్ తనిఖీ చేశారు. ముందుగా వంటశాలను పరిశీలించి ఖైదీలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్తోమత లేనివారు కోర్టు జైలు విజిటింగ్ లాయర్‌ను సంప్రదిస్తే ఉచిత న్యాయవాదిని నియమిస్తారని చెప్పారు. జడ్జి వెంట సబ్‌జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు, జైలు విజిటింగ్ లాయర్ కె. శిరీష, కె.చిట్టిపద్మజ ఉన్నారు.

మల్లిపూడిలో పెదబాపిరెడ్డి మృతి


గుడిమెట్ల పెద బాపిరెడ్డి(ఫైల్)

పెనుమంట్ర: మల్లిపూడి గ్రామ ప్రముఖుడు, ఏ–1 కాంట్రాక్టర్ గుడిమెట్ల పెదబాపిరెడ్డి (78) శనివారం మృతి చెందారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ ఇంటి వద్ద మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతిపై పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు విచారం వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతిని తెలిపారు.

వీడని వాన

నరసాపురం: మూడురోజులుగా కుండపోతగా వర్షం కురుస్తుంది. అయితే నరసాపురంలో శుక్రవారం రాత్రి నుంచి వర్షం తీవ్రత తగ్గింది. శుక్రవారం ఉదయం 8 గంటలు నుంచి శనివారం ఉదయం 8 గంటలు వరకూ నరసాపురంలో 28.6 మిమీ వర్షపాతం నమోదైంది. అయితే వర్షాల ప్రభావం మరో రెండు రోజులు ఉంటుందనే వాతావరణశాఖ హెచ్చరికలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సబ్సిడీ గడ్డి విత్తనాలను వినియోగించుకోవాలి

యలమంచిలి: సబ్సిడీపై వచ్చే గడ్డివిత్తనాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని శిరగారపల్లి గ్రామంలో రైతుసేవాకేంద్రం వద్ద శనివారం పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో ఎదకురాని, చూడికట్టని, గర్భకోశవ్యాధులున్న పశువులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహించి అత్యాధునిక వైద్య సేవలందించారు. కార్యక్రమంలో భీమవరం డివిజన్ ఉపసంచాలకులు జవహర్ హుస్సేన్, తాడేపల్లిగూడెం పశుగణాభివృద్ధి కార్యనిర్వహణాధికారి డాక్టర్ జేసు రత్నం, పాలకొల్లు సహాయ సంచాలకులు డాక్టర్ జి.మల్లేశ్వరరావు, ఆచంట, యలమంచిలి పశువైద్యాధికారులు డాక్టర్ ఫణికుమార్, డాక్టర్ పి.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అడ్మిషన్ల గడువు పెంపు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి (ఏఎస్ఎం) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు స్వీకరణ గడువు ఈ నెల 25 వరకూ పెంచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి తెలిపారు. శనివారం కళాశాలలో గ్రూపులపై వివరిస్తూ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

పెనుగొండ: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు దాసిరెడ్డి కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆచంట పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న భవన నిర్మాణకార్మిక సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఇచ్చిన హామీలో భాగంగా 2018 నుంచి ఆగిపోయిన పెండింగ్ క్లెయిమ్ నిధులు విడుదల చేయాలని కోరారు. కేతా వీరాంజనేయులు, పూసల ఏడుకొండలు, సానబోయిన సత్యనారాయణ, బొలిశెట్టి సత్యనారాయణ, దొంగరాజు పాల్గొన్నారు.

రైతన్నను నిండా ముంచిన వరుణుడు


పెనుగొండ: నీట మునిగిన చేలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి స్పందన


పెనుమంట్ర: జుత్తిగలో చెరువును తలపిస్తున్న పంట చేలు


నరసాపురం రూరల్: సరిపల్లిలో నీట మునిగిన నారుమడులు

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారడంతో గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. మండలంలో గత మూడురోజులుగా సుమారు 108.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో మొగల్తూరులోని పలు పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. ఇంజేటివారిపాలెం, నక్కావారిపాలెం, పాలకమ్మచెరువు ప్రాంతాల్లో ఇటీవల వేసిన ఆకుమడులతో పాటు ముందుగా ఊడ్చిన చేలు చెరువులను తలపిస్తున్నాయి. శనివారం వ్యవసాయాధికారులు మొగల్తూరులోని ముంపునకు గురైన ప్రాంతాలలో పర్యటించి రైతులకు పలుసూచనలు చేశారు. మడుల్లో నిలిచిన నీరు బయటకు తోడాలని, గట్లు తెగొట్టడం, లేదా ఇంజన్లు వేసి నీరుబయటకు వెళ్ళేలా చూడాలని సూచించారు. మరోవైపు స్థానిక గొల్లగూడెం రోడ్డు, స్టేషన రోడ్డు, కోట రోడ్లలో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు.

నారుమడుల పరిశీలన

పోడూరు: గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలో నారుమడులు, వరినాట్లు నీట మునిగాయి. మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ శనివారం జిన్నూరు, కవిటం, పోడూరు, పండితవిల్లూరు, మినిమించిలిపాడు గ్రామాల్లో పర్యటించి నీటమునిగిన నారుమడులను, వరినాట్లను పరిశీలించారు. మండలవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారుగా 3వేల ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయనీ, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సుమారుగా 550 ఎకరాల్లో వరినాట్లు, 100 ఎకరాల్లో వరినాట్లుకు సరిపోయే నారుమడులు నీటమునిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు వ్యవసాయాధికారి తెలిపారు. నీటమునిగిన నారుమడుల్లో వీలైనంత త్వరగా నీరు బయటకు తోడాలని, నీరు బయటకు తోడాక 5 సెంట్ల నారుమడికి 1కిలో యూరియా, 1కిలో పొటాష్ చొప్పున వేయాలని ఆయన రైతులకు సూచించారు. ఆయన వెంట వీఆర్‌ఓలు సీహెచ్.బుజ్జి, కె.శ్రీనివాసరావు, వీఏఏలు ఎస్.సూర్యకిరణ్, ఎ.నరసింహమూర్తి పాల్గొన్నారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: రైతుకు దెబ్బమీదదెబ్బ తగులుతుంది. వరిసాగుకు వరుస ఆటంకాలు ఏర్పడటంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కుంటున్నారు. సార్వ సాగు అనుకూలిస్తుందన్న రైతుకు వర్షాలు తీవ్ర నిరాసకు గురి చేస్తున్నాయి. వారి ఆశలపై వర్షాలు నీరు కారుస్తున్నాయి. నరసాపురం మండలంలో వర్షపు నీటిని డ్రైన్లు నీరు లాగక పోవడంతో నారుమడులు ముంపు బారిన పడ్డాయి. వరుసగా కురుస్తున్న వర్షాలతో రైతులు కుదేలవుతున్నారు. సార్వ సాగుచేసి ఆర్థిక ఇబ్బందులనుంచి గట్టెక్కేద్దామనుకున్న రైతులకు నిరాసే ఎదురవుతుంది. సార్వసాగు నాట్లు ఇప్పటికే పూర్తి కావలిసి ఉండగా కాలువలు వదిలినప్పటికీ శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందకపోవడం వంటి సమస్యలతో సాగుకు జాప్యం వాటిల్లింది. ఇప్పుడిప్పుడే నారుమడులు సిద్ధం చేసుకుని సాగుకు సన్నదమవుతున్న రైతులకు వర్షాలు తీవ్ర ఆటంకాలను కల్పిస్తున్నాయి. మురుగునీటి డ్రైన్లు సరిగా తవ్వకపోవడంతో వర్షపునీరు, మురుగునీరు లాగక పోవడంతో చేలు మరింత ముంపుబారిన పడుతున్నాయి. ముంపు నీరు లాగిన అనంతరం నారుమడుల్లోని నిలువ ఉన్న నీటిని బయటకు పంపే ఏర్పాటు చేసుకోవాలని రైతులకు వ్యవసాయశాఖ అదికారులకు సూచిస్తున్నారు.

నారు మడులను సంరక్షించుకోవాలి

పెనుగొండ: భారీ వర్షాలతో నీట మునిగిన వరి నారుమడులను సంరక్షించుకోవాడనికి రైతన్నలు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి స్పందన సూచించారు. శనివారం మండలంలోని 14 గ్రామాల్లో పర్యటించి నీట మునిగిన వరి చేలను పరిశీలించారు. మండలంలో 63 హెక్టార్ల వరి నారుముడులు, 1320 హెక్టార్లులో నాట్లు వేసిన వరిచేలు నీటి మునిగాయని వివరించారు.

గోస్తనీకి పెరుగుతున్న వరద

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గోస్తనీ డ్రెయిన్‌లు వరద ఉధృతి పెరిగి మెరక ప్రాంతాలు సైతం ముంపుబారిన పడుతున్నాయి. గోస్తనీ డ్రెయిన్ పొంగి ప్రవహిస్తుండటంతో రెండు రోజులుగా పల్లపు ప్రాంతాలలో వరినాట్లు నారుమళ్లు వేసిన పంట పొలాలు పూర్తిగా ముంపులో ఉండగా శనివారం నుంచి గోస్తనీ ఉధృతి పెరుగుతుండటంతో ఎస్ ఇల్లిందలపర్రు, మల్లిపూడి, జుత్తిగ, రామేశ్వరం, వెలగలవారిపాలెం, పెనుమంట్ర, గరువు, మాముడూరు, పాలమూరు గ్రామాలకు చెందిన మెట్ట ప్రాంతాలలో వరి పొలాలకు కూడా ఎర్రనీరు ఎగదన్నడంతో అవి కూడా ముంపునకు గురయ్యాయి.

పెరుగుతున్న గోదావరి ఉధృతి


ఆచంట మండలం కోడేరు వద్ద వరద ఉధృతి

పెనుగొండ: ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద నీరు వశిష్ట గోదావరిలోకి చేరుతుండడంతో పెనుగొండ, ఆచంట మండలాల్లో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. శుక్రవారం సాయంత్రానికి నెమ్మదిగా నీటి మట్టం పెరుగుతూ ఉంది. వరద ఉధృతితో ఆచంట మండలంలోని లంక గ్రామాల ప్రజలు కలవరపడుతున్నారు. ఆచంట మండలంలో పెదమల్లం లంక, అనగారలంక, పల్లిపాలెం, అయోధ్యలంక, పుచ్చల్లంక, రాయిలంకల్లో వేలాది మంది నివాసం ఉంటున్నారు. వీరంతా పడవల్లో నిత్యం కోడేరు చేరుకొని పనులకు వెళుతుంటారు. గోదావరి ఉధృతితో బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. గోదావరి వరద నీరు ఉప్పొంగుతుండడంతో సిద్ధాంతం కేదారీ ఘాట్ వద్ద రైతులు అప్రమత్తం అవుతున్నారు. పుష్కర్ ఘాట్ వరద నెమ్మదిగా మునుగుతుంది. వరద పెరుగుతుండడంతో సందర్శకుల తాకిడి పెరగడంతో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యస్థ లంకలోకి రాకపోకలుపై నియంత్రణ విధించారు. ముఖ్యంగా వందలాది పశువులు మధ్యస్థ లంకలో ఉండిపోవడంతో రైతులు ఉదయం సాయంత్రం వెళ్లి వస్తూ ఉంటారు. వారి పంటలను పడవల్లో కేదారీఘాట్ రేవు వద్దకు తెచ్చుకొని అమ్మకాలు సాగిస్తున్నారు.

ఎంపీడీఓ అదృశ్యం ఘటనలో హైడ్రామా

మాజీ ఎమ్మెల్యే ముదునూరి, వైఎస్సార్ సీపీని ఇరుకున పెట్టడమే లక్ష్యం?


అదృశ్యమైన ఎంపీడీఓ ఎం.వెంకటరమణ

నరసాపురం: నరసాపురం ఎంపీడీఓ ఎం.వెంకటరమణ అదృశ్యం ఘటనలో రోజురోజుకూ చోటు చేసుకుంటున్న హైడ్రామాలు కేవలం మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజును ఇరుకున పెట్టడానికి, వైఎస్సార్ సీపీని బద్నామ్ చేయడానికి పెద్దస్కెచ్‌తో కూటమి నేతలు ముందుకు వెళుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంపీడీఓ అదృశ్యమై ఆరు రోజులు దాటుతున్నా ఈ వ్యవహారంలో అసలు కారణాన్ని ఇంతవరకూ పోలీసులు కనుక్కోలేకపోయారు. చివరకు ఎంపీడీఓ నిజంగా ఆత్మహత్యకు పాల్పడ్డారా? లేక ఎక్కడైనా క్షేమంగా ఉన్నారా? అనే అంశంలో కూడా సస్పెన్స్ కొనసాగుతోంది. ఇక ఎంపీడీఓ అదృశ్యం అయినప్పటి నుంచి ఆయన కుమారుడు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయడం, ఇక్కడి నుంచి టీడీపీ, జనసేన ప్రజాప్రతినిధులు ఎంపీడీఓ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లడం ప్రారంభమైనప్పటి నుంచి కేసులో హైడ్రామాలు కొనసాగుతున్నాయి. ఈ నెల 16న ఎంపీడీఓ కుమారుడు తన తండ్రి అదృశ్యమయ్యారని మాత్రమే ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి ఎంపీడీఓ సూసైడ్ నోట్ డిప్యూటీ సీఎం పేర రాసి తమకు వాట్సప్‌లో పెట్టారని ముందు కుటుంబ సభ్యులు చెప్పారు. మొదట ఎంపీడీఓ కుమారుడు ఇచ్చిన పోలీసు ఫిర్యాదులో ఈ విషయం లేదు. తరువాత కూటమి నేతల పరామర్శల తరువాత వాట్సాప్‌లో సూసైడ్ పెట్టలేదని, నేరుగా రాసిన లెటర్ ఇంట్లో ఇంకో సెల్ ఫోన్ కింద పెట్టి వెళ్లిపోయారని కుటుంబ సభ్యులు చెబుతుండడం అనుమానాలను రేకిత్తిస్తుందని, కేవలం కూటమి నేతల వ్యూహాలకు అనుగుణంగా పోలీసులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇతర కోణాల్లో దర్యాప్తు సాగుతుందా?

అసలు ఎంపీడీఓ మిస్సింగ్ వ్యహారంలో కేవలం నరసాపురం ఫెర్రీ, పాటదారుడు బకాయి చుట్టూ మొత్తం దర్యాప్తు, ప్రచారాలు వ్యూహాత్మకంగా తెరమీదకు తీసుకొచ్చి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారని తెలుస్తోంది. ఏదో రకంగా వైఎస్సార్ సీపీపై బురద జల్లి, మాజీ ఎమ్మెల్యే ముదునూరిపై కేసులు పెట్టాలనే లక్ష్యమే తెరవెనుక వ్యూహాలకు అసలు కారణంగా చెబుతున్నారు. రేవు పాటదారుడు బాకీ విషయంలో చట్టప్రకారం విధివిధానాలను కచ్చితంగా అమలు చేసిన ఎంపీడీఓకు ఈ విషయంలో వచ్చిన ఇబ్బంది ఏమీలేదన్న సంగతి ఇప్పటికే తేటతెల్లమైంది. ఈ కారణంగా ఆయన బలవన్మరణం పొందడానికి కారణం కనిపించడంలేదు. అయితే ఎంపీడీఓ తరచూ ఆఫీసులో ఉన్నప్పుడు రాజస్థాన్‌కు చెందిన కొందకు వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్స్ రిసీవ్ చేసుకోవడం, ఆందోళన పడడం, వారికి ఆన్‌లైన్‌లో సొమ్ములు చెల్లించేవారని పోలీసు దర్యాప్తులో తేలింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంపీడీఓ అంశంపై జిల్లా కలెక్టర్ నాగరాణితో ఫోన్‌లో మాట్లాడినప్పుడు కలెక్టర్ కూడా ఈ విషయాన్ని సీఎంకు తెలియజేశారు. రాజస్థాన్‌కు చెందిన ముకేష్, సంతోష్ అనే వ్యక్తులకు ఎంపీడీఓ ఆన్‌లైన్ ద్వారా సొమ్ము పంపడం, తన వద్ద సొమ్ము లేకపోతే కొన్ని సందర్భాల్లో తన కుమారుడి సెల్ నుంచి కూడా సొమ్ములు పంపినట్లు పోలీసులు గుర్తించారు. అసలు ఈ సంతోష్, ముకేష్‌లు ఎవరు? ఎంపీడీఓ తరచూ ఆందోళనలో ఉండటానికి ఇంకేమైనా బలమైన ఇతర కారణాలు ఉన్నాయా? అన్న అంశాలను తెరమీదకు తీసుకురావడంలేదని విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. ఎంపీడీఓ అదృశ్యంలో ఇతర కారణాలను పూర్తిగా పక్కన పెట్టి కేవలం ముదునూరిపై కక్ష తీర్చుకోవాలనే ధోరణిలో ముందుకెళుతున్నట్టుగా కనిపిస్తోంది.

కూటమి ప్రభుత్వంలో ముదునూరి ఒత్తిళ్లు పనిచేస్తాయా?

నిజానికి ఈ వ్యవహారంలో పంటు పాటదారుడు రేవు నిర్వహణ గడువు మార్చి నెలాఖరుతో ముగిసింది. ఆ సమయం వరకూ రేవు పాటదారుడు ప్రభుత్వానికి ఎలాంటి బకాయిలు లేవు. తరువాత అధికారులే పాట తిరిగి నిర్వహించే వరకూ రోజువారీ రూ.75 వేలు చెల్లించేలా నిర్ణయంచేశారు. అప్పుడే పాటదారుడు రూ.53 లక్షలు బాకీ పడ్డాడు. ఈ సమయంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. తరువాత ఎన్నికలు జరగడం, కూటమి అధికారంలోకి వచ్చింది. ఈ పరిస్థితుల్లో ముదునూరి ఎలా ఒత్తిడి చేయగలరనేది పెద్ద ప్రశ్న. ఎంపీడీఓ కాల్ డేటాను పరిశీలించిన పోలీసులకు ఒక్కసారి కూడా ముదునూరి నుంచి ఎంపీడీఓకు ఫోన్ వెళ్లలేదని తెలిసిందని సమాచారం.

విధివిధానాలకు అనుగుణంగా ఎంపీడీఓ చర్యలు

రేవు నిర్వహణ పాటదారుడు బాకీ విషయంలో ఓ అధికారి నిబంధనలు ప్రకారం ఎలా వ్యవహరించాలో తూచా తప్పకుండా ఎంపీడీఓ వెంకటరమణ అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టారు. రోజువారీ రూ.75 వేలు చెల్లించే విధంగా, తిరిగి పాట నిర్వహించే వరకూ పాత పాటదారుడు రెడ్డప్ప ధవేజీకి రేవు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి పాటదారుడు బాకీ పడటంతో ఎంపీడీఓ నిబంధనల ప్రకారం ఈ విషయాన్ని జెడ్పీ సీఈఓ ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బాకీ పడ్డ సొమ్ము రూ 53 లక్షలు చెల్లించాలని పాటదారుడికి ఏకంగా 9 నోటీసులు పంపారు. రేవు ఆదాయం తూర్పుగోదావరిజిల్లా మలికిపురం మండల పరిషత్‌కు, నరసాపురం మండల పరిషత్‌కు సమానంగా వస్తుంది. దీంతో ఇరు మండల పరిషత్‌ల ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఇతర అధికారులతో కూడి ఉన్న జాయింట్ యాక్షన్ కమిటీకి కూడా తెలియజేశారు. జాయింట్ యాక్షన్ కమిటి నిర్ణయంతో పాటదారుడికి చెందిన రూ.50 లక్షలు విలువ చేసే సొంత పంటను స్వాధీనం చేసుకున్నారు. పాటదారుడు నుంచి బాకీ నిమిత్తం స్టాంప్ పేపర్లపై సంతకాలు తీసుకున్నారు. ఒకవేళ పాటదారుడు సొమ్ము చెల్లించకపోతే లీగల్‌గా చర్యలు తీసుకోవచ్చు. మరోవైపు స్వాధీనం చేసుకున్న తన పంటు రూ.50 లక్షలు, తనకు రేవు నిర్వహణలో వచ్చిన నష్టాలకు ప్రభుత్వం ఇస్తానన్న రూ.11 లక్షలు రాయితీ కలిపి చూసుకుంటే బాకీ పోనూ ఇంకా తన సొమ్మే ప్రభుత్వం వద్ద ఉంటుందనేది పాటదారుడు ధవేజీ వాదన. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఎంపీడీఓకు ఈ వ్యవహారంలో వచ్చిన ఇబ్బంది ఏమీ లేదు. దీంతో ఆయన అదృశ్యం వెనుక ఫెర్రీ వ్యవహారం కాకుండా బలమైన ఇతర కారణాలు ఉంటాయనేది సర్వత్రా చర్చ సాగుతుంది. కాబట్టి ఈ వ్యవహాంలో సమగ్ర విచారణ జరిపి, నిజాలు నిగ్గుతేల్చాలని, ఎంపీడీఓ క్షేమంగా వచ్చేలా చూడాలని వైఎస్సార్‌సీపీ కేంద్రపాలకమండలి సభ్యుడు పీడీ రాజు, పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కామన బుజ్జి, లీగల్‌సెల్ ప్రతినిధి గొట్టుముక్కల సూర్యనారాయణరాజు శనివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చెట్టు కూలడంతో ట్రాఫిక్‌కు అంతరాయం

పెనుమంట్ర: భారీ వర్షం, ఈదురు గాలులు కారణంగా బ్రాహ్మణ చెరువులోని పెనుమంట్ర మార్కెట్ యార్డు గోడౌన్‌ల వద్ద శనివారం ఉదయం భారీ నిద్రగన్నేరు చెట్టు కూలిపోవడంతో మార్టేరు రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

ఎల్‌ఐసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

యలమంచిలి: ఎల్ఐసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగులు, ఏజెంట్లు, పాలసీదారులు కలసికట్టుగా పోరాడాలని ఎల్ఐసీ ఏఐఐఈఏ సౌత్‌సెంట్రల్ జోన్ ప్రెసిడెంట్ కామ్రేడ్ పి.సతీష్ పిలుపునిచ్చారు. పాలకొల్లులో శనివారం ఎల్ఐసీ ఏఓఐ సౌత్‌సెంట్రల్ జోన్ స్టడీ సర్కిల్ నిర్వహించారు. ఆల్‌ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ కామ్రేడ్ ఎల్.మంజునాథ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏఓఐ వైస్ ప్రెసిడెంట్, సీఐటీయూ నాయకుడు ఎస్ఎస్ పొట్టి మృతిచెందడంతో స్టడీ సర్కిల్ కార్యక్రమాలో సంతాపం తెలిపారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సౌత్ సెంట్రల్‌జోన్ ఏఐఐఈఏ ప్రెసిడెంట్ కామ్రేడ్ పి.సతీష్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్ఐసీలో జరుగుతున్న మార్పులు, రాబోయే మార్పులు, ఎల్ఐసీపై రాజకీయ పరిస్థితుల ప్రభావం, ఎల్ఐసీ ప్రొఫైల్స్ తదితర అంశాలను వివరించారు. జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కె.రాజా రామ్మోహన్ రాయ్, జోన్ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ పీఎల్ నరసింహారావు, ఏపీ స్టేట్ ప్రెసిడెంట్ కామ్రేడ్ టి.కోటేశ్వరరావు, జనరల్ సెక్రటరీ కామ్రేడ్ జి.రవికిషోర్ పాల్గొన్నారు.

నేడు రోటరీ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నరసాపురం: రోటరీ క్లబ్ నరసాపురం శాఖ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం సాయంత్రం 6 గంటలకు వైఎన్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు క్లబ్ నూతన అధ్యక్షురాలు గన్నాబత్తుల సత్యవతి శనివారం విలేకరులకు తెలిపారు. ఇప్పటికే అధ్యక్షురాలిగా తనను, కార్యదర్శిగాబొమ్మిడి సూర్యకుమారి, ట్రెజరర్‌గా అత్మూరి రమలను ఎన్నుకున్నారని వివరించారు. పలువురు ప్రజాప్రతినిధులు, రోటరీక్లబ్ ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు.

వర్షం నీటిలో కోడిపందేల దిబ్బ కాలనీ


వర్షం నీటితో నిండిపోయిన పెనుగొండ కోడి పందేల దిబ్బ కాలనీ

పెనుగొండ: నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పెనగొండలోని కోడి పందేల దిబ్బ కాలనీ వర్షపు నీటితో నిండిపోయింది. కాలనీ రహదారులన్నీ నీట మునిగాయి. ముఖ్యంగా మురుగు నీరు వెళ్లే మార్గం లేకపోవడంతో రహదారులన్నీ మురుగు, వర్షపు నీటితో కలిసి దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. తాగునీరు సైతం లేకపోవడంతో వర్షపు నీటిలోనే గ్రామంలోకి వచ్చి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.